క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి మాజీ ఎంపీపీ రూ.25వేల విరాళం



ఆలయ అభివృద్ధికి విరాళం అందజేసిన మాజీ ఎంపీపీ

మునగపాక : ఉమ్మలాడలో శ్రీదేవీతల్లి ఆలయ అభివృద్ధికి శనివారం మునగపాక మండల మాజీ ఎంపీపీ దాసరి గౌరీలక్ష్మి అప్పారావు రూ.25వేల విరాళం అందజేశారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా పలువురు దాతలు ముందు కొస్తున్న నేపథ్యంలో అప్పారావు ఆలయ చైర్మన్ పల్లె అప్పలనాయుడుకు విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పల్లె శ్రీనివాసరావు, ఆటో శ్రీనివాసరావు, నరసింగరావు పాల్గొన్నారు.

చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించాలి



మాట్లాడుతున్న తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు

మునగపాక : అయిదేళ్ల లోపు చిన్నారులకు క్రమం తప్పక టీకాలు వేయించాలని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు కోరారు. తోటాడ పంచాయతీ గవర్ల అనకాపల్లి గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కౌలుకు సీతారాముల ఆలయ భూములు



సీతారాముల ఆలయ భూములను కౌలుకు అప్పగిస్తున్న అధికారులు

మునగపాక : మునగపాక సీతారాముల ఆలయ భూములను శనివారం కౌలుకు తీసుకున్న రైతుకు సంబంధిత అధికారులు అప్పగించారు. గత నెల 28న మునగపాక సీతారాముల ఆలయ భూములకు సంబంధించి కౌలుకు వేలంపాట నిర్వహించిన సంగతి తెలిసిందే. దీంతో సంబంధిత భూమిని దేవాదాయ శాఖ ఈవో మూర్తి, సర్వేయర్, వీఆర్వోలు కౌలుకు పాడిన రైతుకు అప్పగించారు. తోటాడ రెవెన్యూ సర్వేనంబర్ 283/1లో 1.50 సెంట్లు, 283/3లో 1.09 సెంట్లు గంగాదేవిపేటకు చెందిన మొల్లేటి రామచంద్రరావుకు కౌలుకు అప్పగించినట్టు మూర్తి తెలిపారు.

సమష్టిగా ఉత్సవాలు జరుపుకోవాలి



అనకాపల్లి డీఎస్పీ మహేష్‌ను సత్కరిస్తున్న అరబుపాలెం సర్పంచ్ శ్రీను, ఎంపీటీసీ బుజ్జి

మునగపాక : రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని అనకాపల్లి డీఎస్పీ మళ్ల మహేష్ కోరారు. శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా మండలంలోని అరబుపాలెం సీతారాముల వారిని ఆయన శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, ఎంపీటీసీ బొడ్డేడ బుజ్జిలు డీఎస్పీ మహేష్‌ను శాలువాతో సత్కరించారు.

శాఖా గ్రంథాలయంలో పరిశుభ్రత కార్యక్రమం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో శనివారం మన గ్రంథాలయం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పుస్తకాలను, గ్రంథాలను శుభ్రపరిచారు. గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలు ఆపాలి

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని వెదురువాడ కొండపై గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారని వెదురువాడకు చెందిన కొయ్య శ్రీనివాసరావు ప్రకటన విడుదల చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. సంబంధిత అధికారులు రంగంలోకి దిగి అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

‘పది’ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- పరీక్ష కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు
- మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా చర్యలు
- నిమిషం ఆలస్యం అయినా పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు



యలమంచిలి పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఎంఈవో విశ్వనాథం



పదో తరగతి పరీక్ష కేంద్రమైన మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్



నక్కపల్లి బాలుర పాఠశాలలో ఇన్విజిలేటర్లకు సూచనలు ఇస్తున్న హెచ్‌ఎం రాణిలలిత

యలమంచిలి : ఈ నెల 3వ తేదీ సోమవారం నుంచి ప్రారంభం కానున్న పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పాఠశాల విద్యాశాఖ ఇన్విజిలేటర్లు, విద్యార్థులకు ప్రత్యేక నియమావళి నిర్దేశించింది. గతంలో 11 పేపర్లు ఉండగా ప్రస్తుతం 6 పేపర్లకు కుదించారు. ప్రశ్నాపత్రం లీక్ కాకుండా కొన్ని ప్రత్యేక కోడ్ నెంబరును ప్రశ్న పత్రంపై ప్రత్యేక కోడ్ నెంబరు ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఎక్కడ నుంచైనా ప్రశ్నపత్రం లీకైతే కోడ్ నెంబరు ఆధారంగా ఉక్కడ నుంచి లీకయిందో సులభంగా గుర్తించవచ్చు.

ఈ నేపథ్యంలో యలమంచిలి పట్టణంలో పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నామని యలమంచిలి ఎంఈవో బి.విశ్వనాథం అన్నారు. శనివారం ఆయన యలమంచిలి పట్టణం,మండలంలో కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తులసీనగర్‌లో ఉన్న ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, శ్రీచైతన్య టెక్నో స్కూల్,సెయింట్ మేరి స్కూల్, ఉన్న 4 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పట్టణంలో 4 పరీక్ష కేంద్రాల్లో సుమారు 900 మంది విద్యార్థులు హాజరవ్వనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు తాగునీరు, వైద్య సేవలు, టాయిలెట్లు వంటి సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రానికి విద్యార్థులు ఉదయం 8.30 గంటలకు హాజరవ్వాలని, సెల్‌ఫోన్‌లు, వివిధ రకాల వస్తువులు తీసుకురాకూడదని, మాస్ కాపీయింగ్‌కు అస్కారం లేకుండా ఎటువంటి కాగితాలు వెంట తీసుకురాకూడదని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో 10 వ తరగతి పరీక్షలు నిర్వహించనున్నామని తెలిపారు.

పది పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

మునగపాక : పదో తరగతి పరీక్షలను సోమవారం నుంచి పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమయ్యే ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. ఈ నెల 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇప్పటికే పదిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవసరమయ్యే ప్రత్యేక తరగతుల రూపకల్పనకు శ్రీకారం చుట్టారు అధికారులు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి అదనపు తరగతులు నిర్వహించడంతో పాటు ఉపాధ్యాయుల పర్యవేక్షణలో శిక్షణ ఇప్పించారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరగనుంది. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తప్పనిసరిగా 8.45 గంటలకే పరీక్ష కేంద్రాలకు హాజరుకావాలని సూచిస్తున్నారు. నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించేది లేదని అధికారులు చెబుతున్నారు.

4 పరీక్ష కేంద్రాలు...604 మంది విద్యార్థులు

మునగపాక మండల వ్యాప్తంగా 6 జిల్లా పరిషత్ హైస్కూళ్లు, పాటిపల్లి మోడల్ స్కూల్,కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంతో పాటు ప్రగతి,ప్రియదర్శిని,ప్రణతి ప్రయివేటు స్కూళ్లకు చెందిన 604 మంది విద్యార్థులు ఈ ఏడాది పరీక్ష రాయనున్నారు. ఇందుకోసం మండలంలోని నాలుగు పరీక్ష కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. మునగపాక, నాగులాపల్లి, గణపర్తి జిల్లా పరిషత్ హైస్కూళ్లతో పాటు మునగపాకలోని ప్రగతి పబ్లిక్ స్కూల్‌లో పరీక్షలు రాసేందుకు అవసరమయ్యే ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే పరీక్ష రాసే విద్యార్థులకు అవసరమయ్యే బెంచీలు, తాగునీటి సదుపాయం, విద్యుత్ సదుపాయం కల్పించారు.

నక్కపల్లి: ఈనెల 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, విద్యుత్తు, తాగునీరు, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేశామని ఎంఈవో డీవీడీ ప్రసాద్, బాలుర పాఠశాల సూపరింటెండెంట్ రాణిలలితలు తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాట్లపై వారు సమీక్షించారు. నక్కపల్లిలో గురుస్ పాఠశాల(ప్రైవేటు)ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాల గొడిచర్లలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మొత్తం 1385 మంది విద్యార్థులు ఈ కేంద్రాల్లో పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాలకు అరగంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని, నిర్ణీత సమయానికి ఒక నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించేది లేదన్నారు. ఈ సందర్భంగా ఇన్విజిలేటర్లకు వారు పలు సూచనలు చేశారు. బార్‌కోడింగ్‌పై అవగాహన కల్పించారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి



రాజయ్యపేట కాలనీని సందర్శించిన అధికారులు

నక్కపల్లి : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీవో సీతారామరాజు, తహసీల్దార్ నీరజ సూచించారు. శనివారం వారు రాజయ్యపేట జగనన్న కాలనీలో పర్యటించారు. లబ్ధిదారులతో మాట్లాడి తక్షణమే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలన్నారు. ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తోందన్నారు. మండలంలో కలెక్టర్ వారు నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. హౌసింగ్ డే సందర్భంగా ప్రతి శనివారం జగనన్న కాలనీలను సందర్శించి లబ్ధిదారులకు అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. కాలనీల్లో వాడుక నీరు, రోడ్లు, విద్యుత్ సదుపాయం కల్పించడం జరిగిందన్నారు. సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది, గృహనిర్మాణ శాఖ సిబ్బంది కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలపై దృష్టి సారించాలన్నారు.

మెగా ఫోన్ల పంపిణీ



కోటవురట్లలో కార్యదర్శులకు మెగాఫోన్లు అందజేస్తున్న అధికారులు

కోటవురట్ల : ప్రభుత్వం నుంచి వస్తున్న ముఖ్య సమాచారాన్ని మెగా ఫోన్ల ద్వారా ప్రజలకు తెలియజేయాలని మండల ప్రత్యేకాధికారిణి ఉదయశ్రీ సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం కార్యదర్శులకు మెగాఫోన్లు అందజేశారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని 25 గ్రామ పంచాయతీలకు మెగా ఫోన్లు వచ్చాయని వీటి ద్వారా సమాచారం ప్రజలకు చేరవేయాలన్నారు. గ్రామాలలో జరిగే ముఖ్య కార్యక్రమాలు, పారిశుద్ధ్యంపై అవగాహన వంటి కార్యక్రమాలను మెగా ఫోన్లను ఉపయోగించి తెలియజేయాలన్నారు. ఎంపీడీవో చంద్రశేఖర్, ఈవోపీఆర్డీ ప్రేమ్‌సాగర్, పీఆర్ జేఈ వర్మ, కార్యదర్శి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కూలీలకు గిట్టుబాటు వేతనం కల్పించాలి



ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీవో

నక్కపల్లి : ఉపాధి హామీ పథకంలో కూలీలందరికీ గిట్టుబాటు వేతనం లభించే విధంగా పనులు కల్పించాలని ఎంపీడీవో సీతారామరాజు ఆదేశించారు. శనివారం ఆయన ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం ఉపాధి కూలీలకు వేసవి అలవెన్సు మంజూరు చేసిందన్నారు. రోజుకు రూ.270 గిట్టుబాటు అయ్యే విధంగా చర్యలు చేపట్టిందన్నారు. సోమవారం నుంచి జాబ్‌కార్డు కలిగిన కూలీలంతా పనులకు హజరయ్యే విధంగా ఫీల్డ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలన్నారు. మస్టరు విషయంలో అక్రమాలు జరిగితే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏపీవో ఈశ్వరరావు పాల్గొన్నారు.

చెత్తాచెదారం తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



ఎయిర్‌వాల్వులో చెత్తాచెదారాన్ని తొలగించిన దృశ్యం

రాంబిల్లి : దిమిలిలో రక్షిత మంచినీటి పథకం ఎయిర్‌వాల్వులో చెత్తాచెదారాన్ని శనివారం తొలగించారు. శనివారం సాక్షి దినపత్రికలో ఎయిర్ వాల్వులో చెత్తాచెదారం శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు స్పందించారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని మండల అధికారులను ఆదేశించారు. సర్పంచ్ బంగారు చిలుకు, పంచాయతీ కార్యదర్శి జి. రాజుబాబు దీనిపై స్పందించారు. ఎయిర్ వాల్వులో చెత్తాచెదారాన్ని తొలగించారు. మురుగునీరు పోయేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. మురుగుపోయేందుకు సంతోషిమాత ఆలయం సమీపంలో కాలువను తవ్వారు. యిర్‌వాల్వుకు ప్రత్యేకంగా పైపు ఏర్పాటు చేసి ఎయిర్‌వాల్వు చుట్టూ వున్న కుండీని మట్టితో కప్పివేస్తున్నారు.

చలో ఢిల్లీ విజయవంతం చేయాలి



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న దేముడునాయుడు

రాంబిల్లి: కేంద్రంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని సీఐటీయూ మండల కార్యదర్శి జి. దేముడునాయుడు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 5న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ మేరకు రాంబిల్లిలో శనివారం ఆయన గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్మిక నాయకులు రామకృష్ణ, రాంబాబు పాల్గొన్నారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): ఈ నెల 5న నిర్వహించే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు రాము పిలుపునిచ్చారు. కార్మిక, కర్షకులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని ఆయన తెలిపారు. ఈ క్రమంలో శనివారం తిమ్మరాజుపేట, కొండకర్ల, అచ్యుతాపురం, దోసూరు గ్రామాల్లో పర్యటించి భవన నిర్మాణ కార్మికులతో సమావేశమయ్యారు. లేబర్ కోడ్‌లో తీసుకొచ్చిన మార్పులను నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. శ్రీను, తాతారావు, రాజు, రమేశ్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం



ధారభోగాపురంలో అవగాహన ర్యాలీ

రాంబిల్లి : చిరుధాన్యాలతో ఆరోగ్యం సాధ్యపడుతుందని ఎంపీటీసీ ధూళి రమణమ్మ అన్నారు. ధారభోగాపురంలో శనివారం చిరుధాన్యాల ప్రాముఖ్యతపై ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. చిరుధాన్యాలతో వంటకాలు పోటీలు నిర్వహించి విజేతలకు ఎంపీటీసీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. టాటా ట్రస్టు, విజయవాహిని సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్యక్రమ కోఆర్డినేటర్ అరుణ, ఎ.సి.డి పీవో లలిత కుమారి, పోషణ సఖి దేవి, ఉమ, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో అసిస్టెంట్ కలెక్టర్



మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

మునగపాక : మునగపాక తహసీల్దార్‌గా అసిస్టెంట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి శనివారం తన శిక్షణలో భాగంగా బాధ్యతలు నిర్వహించారు. నెల రోజుల పాటు ఆమె స్థానిక తహసీల్దార్‌గా విధులు నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ రెవెన్యూ పరమైన సేవలందించేందుకు తాను తన శిక్షణలో భాగంగా ఇక్కడకు వచ్చానన్నారు. నెలరోజుల పాటు తహసీల్దార్ విధులను సక్రమంగా నిర్వహించి సేవలందిస్తానన్నారు. అందరి సహకారంతో ఈ ప్రాంత అభివృద్ధికి పాటుపడతానన్నారు. రెవెన్యూలోని పలు అంశాలపై ప్రతి రోజూ కిందిస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహిస్తామన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

ఎస్.రాయవరం: స్థానిక బుగ్రేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతులు కల్యాణం ఎంతో రమ్యంగా నిర్వహించారు. శివపార్వతుల ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి రాత్రికి కల్యాణం నిర్వహించారు. స్వామివారి దంపతులకు సాధారణ పెళ్లిలో నిర్వహించే ఎదురు సన్నాహాలు, కట్నకానుకలు మాట్లాడి కల్యాణ సంప్రదాయాలు పాటిస్తూ కల్యాణోత్సవం జరిపారు. స్వామి కల్యాణం తిలకించడానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

ఘనంగా సీతారామస్వామి కల్యాణోత్సవం



కొరుప్రోలులో సీతారామస్వామి

ఎస్.రాయవరం: కొరుప్రోలు శ్రీ సీతారామ స్వామి వారి కల్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రీ నవమి తరువాత ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని సీతారాములు కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ మేరకు శనివారం ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. రాత్రికి కల్యాణం నిర్వహించారు.

నేడు యాదవ హక్కుల పోరాట సమితి సమావేశం

కశింకోట : జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి అనకాపల్లి జిల్లా సమావేశం కొత్తూరు వద్ద సత్యనారాయణస్వామి దేవాలయ ఆవరణలోని తోటలో ఆదివారం ఉద యం 9 గంటలకు ఏర్పాటు చేసినట్టు సమితి అధ్యక్షుడు వియ్యపు భూలోకనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉన్న నియోజక వర్గాలు, మండలాలు, గ్రామాల వారీగా ప్రధాన కమిటీలు, అనుబంధ కమిటీలు ఏర్పాటు చేసి నియా మకపు పత్రాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. సమావేశానికి సమితి అఖిల భారత ప్రధాన కార్య దర్శి మండేం సుభాష్ చంద్రబోస్ యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు (వర్కింగ్) ఇసరపు శేఖర్ యాదవ్ తదితరులు హాజరవుతారన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణోత్సవాలు ప్రారంభం



నక్కపల్లిలో ఎదురు సన్నాహ మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



మహిళల కోలాటం

నక్కపల్లి : ప్రాచీన శివాలయం ఉపమాకలో ఉన్న భువనేశ్వరి సమేత లక్ష్మణేశ్వర స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు శనివారం రాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. ఐదురోజుల పాటు ఈ కల్యాణోత్సవాలు నిర్వహించేందుకు దేవదాయ శాఖ ఆలయ పాలకవర్గం నిర్ణయించింది. శనివారం అంకురార్పణ నిర్వహించారు. ఉపమాక వేంకటేశ్వర స్వామి దేవస్థాన ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, శివాలయం అర్చకులు వెలవలపల్లి మహేశ్‌ల అధ్వర్యంలో ధ్వజారోహణం, హోమాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఊరేగింపుగా నక్కపల్లి తీసుకెళ్లారు. శింగంశెట్టి నానీ కుటుంబీకుల ఆధ్వర్యంలో మైలవర భట్ల జోగారావు, మంచిరాజు వీరభద్రరావు(సహారా పంతులు) ఇంటి వద్ద ఎదురు సన్నాహమహోత్సవం ఘనంగా నిర్వహించారు. సప్పరం వాహనంపై పరమేశ్వరుడ్ని, పల్లకిలో అమ్మవారి ఉత్సవమూర్తులను ఉంచి నక్కపల్లి తీసుకు వచ్చారు. అక్కడ ఎదురు సన్నాహమహోత్సవం నిర్వహించారు. కల్యాణోత్సవాల సందర్భంగా మహిళలు నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. అనంతరం స్వామివారి ప్రాశస్త్యాన్ని వివరించిన డాక్టర్ వేదాల గాయత్రీదేవిని ఘనంగా సన్మానించారు. కాపు కార్పొరేషన్ డైరక్టర్ వీసం రామకృష్ణ, శివాలయం చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు, ఈవో మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు కొప్పిశెట్టి హరిబాబు పాల్గొన్నారు.

చదువుతోనే ఉత్తమ భవిష్యత్తు



ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

మునగపాక : తల్లిదండ్రులు తమ పిల్లల చదువులపై దృష్టి సారించాలని మునగపాక ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సావిత్రి కోరారు. శనివారం పాఠశాల ఫేర్‌వెల్ ఫంక్షన్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందన్నారు. అలాగే తల్లితండ్రులు కూడా పిల్లల చదువులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు పని చేస్తున్నారని, అలాగే మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పీఎంసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సొంతిల్లు ఉండాలన్నదే లక్ష్యం



కోటవురట్ల లే అవుట్‌లో సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

కోటవురట్ల: ప్రతి కుటుంబానికి సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న కాలనీ లే అవుట్లను తయారు చేసి ఇళ్లు కట్టుకునేందుకు సహాయం చేస్తోందని ప్రత్యేకాధికారిణి ఉదయశ్రీ అన్నారు. స్థానిక మహాలక్ష్మి అమ్మవారి ఆలయం సమీపంలోని వైఎస్సార్ జగనన్న కాలనీ లే అవుట్‌లో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మండల పరిషత్ సమావేశ మందిరంలో అధికారులతో ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష చేశారు. ఎక్కడైనా సమస్య ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. లే అవుట్లలో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని సూచించారు. ఎంపీడీవో చంద్రశేఖర్, ఈవోపీఆర్డీ ప్రేమ్‌సాగర్, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



ఉమ్మలాడలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీఎల్‌డీవో మంజులావాణి

మునగపాక : జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని డీఎల్‌డీవో మంజులావాణి కోరారు. హౌసింగ్ డే లో భాగంగా శనివారం మండలంలోని ఉమ్మలాడలో ఆమె జగనన్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్దిదారులను ఉద్దేశించి మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు అందజేయడంతో పాటు ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం సాయం అందజేస్తుందన్నారు. కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచ్ సూరిశెట్టి గంగయమ్మ(ఎస్‌ఆర్), ఉప సర్పంచ్ మందా రాము,ఈవోఆర్డీ ఈశ్వరరావు, వార్డు సభ్యులు సతివాడ హేమ శ్రీనివాస్, ఉండ్రు రేవతీ నిరంజన్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ అనురాధ, సిఏ నాగమణి కార్యక్రమంలో పాల్గొన్నారు.

గంగునాయుడు మృతి బాధాకరం



నాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్

మునగపాక : ఉమ్మలాడ గ్రామాభివృద్ధే ధ్యేయంగా సేవలందించిన మొల్లేటి గంగునాయుడు మృతి బాధాకరమని ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మలాడ మాజీ ఉప సర్పంచ్,గౌరీ సంఘ అధ్యక్షుడు స్వర్గీయ గంగునాయుడు సంతాపసభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ గంగునాయుడు ఉప సర్పంచ్‌గానూ, గౌరీ సంఘ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఆయన మృతి గ్రామానికి తీరనిలోటని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కృష్ణవేణి, మాజీ ఎంపీపీ దాసరి అప్పారావు, గంగునాయుడు కుమారులు ఆనంద్‌కుమార్, భాస్కర్ పాల్గొన్నారు.

రైతులంతా ఈకేవైసీ చేయించుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు



మాట్లాడుతున్న జేడీ మోహనరావు

నక్కపల్లి : జిల్లాలో రైతులంతా పీఎం కిసాన్ ఈకేవైసీ చేయించుకోవాలని అనకాపల్లి జిల్లా వ్యవసాయాధికారి(అగ్రికల్చర్ జేడీ) కె. మోహన్‌రావు తెలిపారు. శనివారం ఆయన నక్కపల్లి మండలంలో పనిచేస్తున్న ఆర్‌బీకేల సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు అందాలంటే ఈకేవైసీ తప్పనిసరి అని అన్నారు. ఈకేవైసీపై ఆర్‌బీకే సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వైఎస్సార్ యాప్ పనితీరును మెరుగు పరచాలన్నారు. వేసవిలో చిరుధాన్యాలను వేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఖరీఫ్‌లో వేస్తున్న పంటలు క్రాప్ బుకింగ్‌కి ప్రణాళిక వేసుకోవాలన్నారు. కియోస్కో పనితీరు వైఎస్సార్ యంత్ర సేవ గురించి ఆర్‌బీకే సిబ్బందికి అవగాహన కల్పించి అవి పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. నక్కపల్లి మండలంలో 14564 మందికి పీఎం కిసాన్ పథకం ద్వారా ఆర్థిక సాయం అందుతుందన్నారు. సుమారు 2017 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోకపోవడం వల్ల లబ్ధి పొందలేదన్నారు. వలంటీర్ల సాయంతో రైతులందరికి ఈకేవైసీ చేయాలన్నారు. కార్యక్రమంలో పాయకరావుపేట ఏడీ రాజ్‌కమల్, నక్కపల్లి ఏవో ఉమాప్రసాద్, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.